PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

విజయవాడ,హైదరాబాద్ సంపుటి 01 సంచిక 74 ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు శుక్రవారం 19 జూన్ 2026 వెల -3 పేజీలు -8

**విజయవాడ కస్టడీ డెత్: సీబీఐ విచారణ జరిపించాలి: వై.ఎస్. జగన్**

మే 9 నుంచి అదృశ్యమైన యువకుడు సాయికృష్ణ

బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ తీరుపై విమర్శలు

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అనుమానాస్పద మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సాయికృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్, డీజీపీ స్థాయి అధికారులు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

# అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'



## మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం

కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

2

అమరావతి



## హైదరాబాదీ వైద్యుడికి బ్రిటన్‌లో అత్యున్నత గౌరవం

ప్రొఫెసర్ వసీం హనీఫ్‌కు బ్రిటన్‌లో అరుదైన గౌరవం

వైద్య రంగంలో సేవలకుగాను ప్రతిష్ఠాత్మక ఓబీఈ పురస్కారం

కింగ్స్ బర్త్‌డే ఆనర్స్ 2026 జాబితాలో చోటు

డయాబెటిస్, ఆరోగ్య అసమానతలపై చేసిన కృషికి గుర్తింపు



హైదరాబాద్/ బ్రిటన్

2

## 'పార్లమెంట్‌పై దాడి చేసినవారికి, ఎంపీని టార్చర్ చేసిన వారికీ తేడా లేదు'


### - హైకోర్టు కీలక వ్యాఖ్యలు

పార్లమెంటుపై దాడి చేసినవారికి, ఎంపీని కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన వారికీ మధ్య తేడా లేదు – అలాంటి ఘటనల్లో పాలుపంచుకోకుండా సునీల్ నియంత్రించుకోవాల్సిందన్న హైకోర్టు

– సునీల్‌నాయక్ ఎప్పటిలోగా సరెండర్ అవుతారో చెప్పాలన్న హైకోర్టు

అమరావతి

2




## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు..' కోస్తా గ్రీన్ బెల్ట్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక సమీక్ష

అటవీ, పర్యాటక ఉన్నతాధికారులతో పవన్ సమీక్షా సమావేశం

గ్రీన్ జోన్స్ ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చన్న పవన్

స్థానిక ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని సూచన

అమరావతి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో స్పీడ్ పెంచింది

. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహజ వనరులను వాడుకుంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా

2



## ఆక్వా, పొగాకు, మామిడి రైతులకు భారీ ఊరట

- నష్టాలు రాకుండా ప్రభుత్వం చేయూత

సీఎం నిర్దేశంతో ఆక్వా ఫీడ్ ధర కిలోకు 4 రూపాయలు మేర తగ్గింపు

- పొగాకు ధర కిలో రూ.200కి తగ్గకుండా కొనుగోళ్లు జరగాలని ఆదేశం

-కిలో తోతాపురి మామిడికి రూ.4 చెల్లించాలని నిర్ణయం

అమరావతి

: ఆక్వా, పొగాకు, మామిడి రైతులు నష్టపోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పొగాకు ధర కేజీ రూ. 200 తగ్గకుండా కొనుగోళ్లు జరగాలని సీఎం ఆదేశించారు. తోతాపురి మామిడికి కేజీకి 4 రూపాయలు ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించింది. సీఎం నిర్దేశంతో ఆక్వా ఫీడ్ ధర కిలోకు 4

2



## ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకూ విద్యాకానుక కిట్లు

- మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం

లక్షకు పైగా విద్యార్థినులకు తక్షణమే 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలి

- కేంద్రం ప్రవేశపెట్టిన 'పీఎంశ్రీ' నిధుల వినియోగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది - విద్యాశాఖపై అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

అమరావతి

: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 430 కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న లక్షకు పైగా విద్యార్థినుల కోసం తక్షణమే 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎంశ్రీ' నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు కూడా విద్యా కానుక కిట్ల పంపిణీ చేపడుతున్నట్లు ప్రకటించారు.

ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులను మంత్రి లోకేశ్ అభినందించారు. కడప మోడల్ లో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి

2



# అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

మౌలిక వసతులు, విద్యార్థి కిట్లపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

అనాథ పిల్లలకు 'తల్లికి వందనం' భరోసా

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు.

అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ఇది వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా ఇస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

అభ్యసన సామర్థ్యాల పెంపు, తెలుగు భాషకు ప్రాధాన్యం

పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువమంది విద్యార్థులు గణితం, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్నారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన లోకేశ్, ఎట్టి పరిస్థితుల్లోనూ మాతృభాష తెలుగును విస్మరించవద్దని, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు తరగతులు నిర్వహించాలన్నారు.

ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం వంటి ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షించి కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు శాతం 95కి తగ్గకుండా, మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడకుండా చూడాలన్నారు.

ఆధునికీకరణ, పారదర్శకత దిశగా అడుగులు

తెలుగు అకాడమీ ముద్రించే పాఠ్యపుస్తకాలను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌ల ద్వారా విక్రయించాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల అనుమతుల్లో అనవసర నిబంధనలను తొలగించాలని, అదే సమయంలో వారు నిర్ణయించిన ఫీజుల వివరాలను స్కూళ్ల బయట బోర్డులపై ప్రదర్శించడంతో పాటు పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని స్పష్టం చేశారు.

హైస్కూలు విద్యార్థులకు త్వరగా క్రోమ్ బుక్స్‌తో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు అందించాలని కూడా మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాదీ వైద్యుడికి బ్రిటన్‌లో అత్యున్నత గౌరవం

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డయాబెటిస్ వైద్య నిపుణుడు, ప్రొఫెసర్ మహమ్మద్ వసీం హనీఫ్‌కు బ్రిటన్‌లో అరుదైన గౌరవం లభించింది. వైద్య రంగంలో, ముఖ్యంగా మధుమేహ నియంత్రణకు, ఆరోగ్య అసమానతలను తగ్గించడానికి ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' (ఓబీఈ) పురస్కారంతో ఆయనను సత్కరించారు. కింగ్స్ బర్త్‌డే ఆనర్స్ 2026 జాబితాలో ఆయన పేరును అధికారికంగా ప్రకటించారు.

వసీం హనీఫ్ హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగారు. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోని గాంధీ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేశారు. 1995లో యూకేకు వలస వెళ్లిన ఆయన, గత మూడు దశాబ్దాలుగా డయాబెటిస్, ఎండోక్రైనాలజీ రంగాల్లో పరిశోధన, విద్య, వైద్య విధాన రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

ప్రస్తుతం ఆయన బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ హాస్పిటల్స్‌లో ప్రొఫెసర్‌గా, 'డయాబెటిస్ యూకే' సంస్థకు క్లినికల్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. దీనితో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ , యూరోపియన్ యూనియన్, యూకే పార్లమెంట్‌కు సైతం సలహాదారుగా సేవలు అందిస్తున్నారు.

ఈ పురస్కారంపై ప్రొఫెసర్ హనీఫ్ స్పందిస్తూ, "ఈ గౌరవం దక్కడం చాలా ఆనందంగా ఉంది. డయాబెటిస్‌తో బాధపడుతున్న వారి జీవితాలను మెరుగుపరచడానికి, సమాజంలో ఆరోగ్య అసమానతలను రూపుమాపడానికి నేను ఎల్లప్పుడూ కృషి చేశాను. ఇది నా ఒక్కడి విజయం కాదు, నా సహచరులు, పరిశోధకులందరి సమష్టి కృషి ఫలితం" అని తెలిపారు.

# 'పార్లమెంట్‌పై దాడి చేసినవారికి, ఎంపీని టార్చర్ చేసిన వారికీ తేడా లేదు'

రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ విచారణ సందర్భంగా ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్‌పై దాడి చేసినవారికి, ఎంపీని కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన వారికీ మధ్య తేడా లేదని హైకోర్టు పేర్కొంది. అలాంటి ఘటనల్లో పాలుపంచుకోకుండా సునీల్ నియంత్రించుకోవాల్సిందని తెలిపింది.

సునీల్ నాయక్ ఎప్పటిలోగా సరెండర్ అవుతారో చెప్పాలని సూచించింది. ఎంపీని టార్చర్‌కు గురి చేయబోతున్నారని ఆయనకు బాగా తెలుసని వెల్లడించింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సునీల్‌ది కీలకపాత్రని తెల్చి చెప్పింది. సునీల్ నాయక్ సరెండర్ అవుతారా? లేదా ముందస్తు బెయిల్‌పై వాదనలు వినిపిస్తారా? నిర్ణయించుకోవాలని ధర్మాసనం పేర్కొంది. చివరికి పిటిషనర్‌తో మాట్లాడి వివరాలు కోర్టు ముందు ఉంచుతామని సునీల్ లాయర్ హైకోర్టుకు తెలిపారు.

ఆ అధికారులపై కొనసాగుతున్న దర్యాప్తు : ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ అధికారులపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో అప్పటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్ (ఎ-2 నిందితుడు), ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ (ఎ-1 నిందితుడు) లను పోలీసులు విచారించారు.

ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి ఎం. సునీల్ నాయక్‌ను గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో పోలీసులు పలు రోజుల పాటు విచారించారు. రాత్రి వేళల్లో సీఐడీ ఆఫీసులో ఏం జరిగిందో, ఎవరి ఆదేశాల మేరకు నడుచుకున్నారో ఆయన్ను ప్రశ్నించారు. ఆయన విచారణలో భాగంగా కొన్ని ప్రశ్నలకు దాటవేత సమాధానాలు ఇచ్చారు.

ఆనాటి పరిణామాలపై ప్రశ్నలు: ఒక ఎంపీని అరెస్టుచేసే ప్రక్రియను ఎందుకు వీడియో తీయలేదు. నిబంధనలు ఎందుకు పాటించలేదని పోలీసులు ప్రశ్నించారు. గుండె శస్త్రచికిత్స చేసుకున్న వ్యక్తిని వైద్యుడి పర్యవేక్షణ లేకుండా హైదరాబాద్ నుంచి గుంటూరు తరలించడంతో పాటు ఆ రోజు పరిణామాలపై పలు ప్రశ్నలు వేసినట్లు తెలిసింది. అయితే సునీల్ నాయక్ దేనికీ సూటిగా బదులివ్వలేదు. రఘురామ రచ్చబండలో చేసిన వ్యాఖ్యలు, వాటి వీడియో క్లిప్పింగ్లపై ఫోరెన్సిక్ పరీక్షలు చేయించకుండానే అవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఎలా నిర్ధారణకు వచ్చారు?

ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ: డిప్యుటేషన్ పై ఏపీకి వచ్చిన మీరు ఇలాంటి పనులతో కొందరి మెప్పు పొంది ఇక్కడే ఉండిపోవాలని ఆశించారా? అని పోలీసులు అడగ్గా అలాంటిదేమీ లేదని చెప్పినట్లు తెలిసింది. రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్ మాటలను ఎలా విశ్వాసంలోకి తీసుకొని ఈ కేసులో సాక్ష్యంగా పరిగణించారని అడగ్గా ఆయన రాతపూర్వకంగా అందించినప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చిందని బదులిచ్చినట్లు తెలిసింది. తాజాగా ఏపీ హైకోర్టులో సునీల్ నాయక్ వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై ఇవాళ విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు సునీల్ నాయక్‌పై పలు కీలకు వ్యాఖ్యలు చేసింది.

# కోస్తా గ్రీన్ బెల్ట్‌పై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

లోకేశ్ నిరంతరం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ఏపీకి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అటు టూరిజం పరంగా, ఇటు పర్యావరణ పరంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతోంది.

ఏపీ కోస్తా తీరాన్ని శరవేగంగా అభివృద్ధి చేయడమే కాకుండా, పర్యావరణ రక్షణ కోసం 'కోస్తా గ్రీన్ బెల్ట్'ను విస్తరించేందుకు డిప్యూటీ పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈరోజు సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

తీర ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటి, హరిత వలయాలను (గ్రీన్ జోన్స్) ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని, తుపానుల తీవ్రతను తగ్గించవచ్చని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనికోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ గ్రీన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో కేవలం ప్రభుత్వానిదే కాకుండా స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల (రాశీఎఋశ్రీ ఖీశీతీవర్‌తీఎ) పెంపకానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులకు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకూ విద్యాకానుక కిట్లు

అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పీటీఎం నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 430 కేజీబీవీల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. కేజీబీవీలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు.

2,03,430 మంది విద్యార్థులకు కిట్ల పంపిణీ : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్ల పంపిణీ చేపట్టినట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసరమైన నిబంధనలను తొలగించాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో నిర్ణయించిన ఫీజులను స్కూళ్ల వెలుపల బోర్డులపై ప్రదర్శించడంతోపాటు పబ్లిక్ డొమైన్‌లో పొందుపర్చాలన్నారు. రాష్ట్రంలోని అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం డబ్బులు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.

ఈ పథకం అమలు కోసం పిల్లల గార్డియన్ల వివరాలను కచ్చితంగా సేకరించాలని, ఒకవేళ ఎవరూ లేని పక్షంలో ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, అక్కడ నుండి పిల్లలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసి, వారి చదువు పూర్తయిన తర్వాత ఆ సొమ్మును స్వతంత్రంగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానం ఆలోచన చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నిర్ణయం తీసుకోవడం వలన తల్లిదండ్రులు లేని పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా, వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి అన్నారు.

ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌లో అకాడమీ పుస్తకాలు : తెలుగు అకాడమీ ముద్రించే టెక్స్ట్‌బుక్స్ ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చేలా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్ ద్వారా విక్రయించాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని వీలైనంత త్వరగా కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు వారి హాజరు శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

చదువులో వెనుకబడిన కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, పోలవరం తదితర జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఆయా జిల్లాలలో ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఒక ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల పాఠశాల హాజరు 95 శాతానికి తగ్గకుండా పక్కా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల్లో అధికశాతం మ్యాథ్స్, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్న విషయాన్ని అధికారులు మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో మాతృభాష తెలుగును విస్మరించొద్దు, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి విద్యార్థులకు అందజేయాలి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఇప్పటినుంచే వారికి అదనపు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని మెరుగుపర్చడంపై టీచర్లు శ్రద్ధ వహించాలన్నార. సాధ్యమైనంత త్వరగా హైస్కూలు విద్యార్థులకు క్రోమ్ బుక్స్ తో కూడిన కంప్యూటర్ ల్యాబ్స్ అందజేతకు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు.

# నీట్ రీఎగ్జామ్ రాయబోతున్న విద్యార్థులకు ఎన్టీయే సూచన

నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్‌కు మరో మూడు రోజులే సమయం ఉన్న నేపథ్యంలో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అభ్యర్థులకు కీలక సూచనలు చేసింది. జూన్ 21 (ఆదివారం) జరగనున్న ఈ పరీక్షకు ప్రశాంతంగా సిద్ధం కావాలని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది.

ఈ మేరకు ఎన్టీఏ 'ఎక్స్' వేదికగా విద్యార్థులకు భరోసానిస్తూ ఒక సందేశాన్ని పోస్ట్ చేసింది. "మీరు ఎంతో కష్టపడి సిద్ధమయ్యారు. ఇప్పుడు మీ శ్రమపై నమ్మకం ఉంచాల్సిన సమయం వచ్చింది. ఆందోళన చెందకుండా, తగినంత విశ్రాంతి తీసుకుని పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చండి" అని పేర్కొంది.

మే 3న జరిగిన పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో నీట్ యూజీ-2026 పరీక్ష రద్దయిన సంగతి తెలిసిందే. ప్రతిభావంతులైన విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్టీఏ పునరుద్ఘాటించింది.


పరీక్షల పారదర్శక నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అభ్యర్థులు అధికారిక సమాచారం కోసం ఎన్టీఏ వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని సూచించింది.

పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థుల కోసం 'మానస్' (14416) మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని ఎన్టీఏ సూచించింది. "ఒత్తిడికి లోనవుతుంటే మీరు ఒంటరి వారని భావించకండి. సహాయం కోరడం బలహీనత కాదు, అది మీ బలానికి నిదర్శనం" అని పేర్కొంది. నిర్ధారణ లేని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కోరింది.

# 'మా ఇంటి బంగారం' విడుదల.. అంచనాలు పెంచుతున్న బుకింగ్స్

జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా 'మా ఇంటి బంగారం' విడుదల
సినిమాకు భారీ స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్
టిక్కెట్ల బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయని తెలిపిన చిత్ర యూనిట్
నందినీ రెడ్డి దర్శకత్వం, రాజ్ నిడిమోరు క్రియేటర్
చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. రేపు (జూన్ 19న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ భారీ స్థాయిలో జరుగుతున్నాయి. పలు ప్రధాన నగరాల్లో షోలు వేగంగా నిండుతుండటంతో సినిమాపై నెలకొన్న అంచనాలు స్పష్టమవుతున్నాయి.




ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా బుకింగ్స్ చాలా వేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. గంట వ్యవధిలోనే దాదాపు 3.49 లక్షల టిక్కెట్లు బుక్ అయినట్లు వారు ప్రకటించడం సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఈ ట్రెండ్ చూస్తుంటే సినిమాకు తొలిరోజు అదిరిపోయే ఓపెనింగ్స్ ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

'ఓ బేబీ' ఫేమ్ నందినీ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా, సమంత భర్త రాజ్ నిడిమోరు క్రియేటర్‌గా వ్యవహరించారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారాయణన్ సంగీతం అందించడం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. సమంత, నందినీ రెడ్డి, రాజ్ నిడిమోరు వంటి విలక్షణమైన ప్రతిభావంతుల కలయికలో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# క్యాన్సర్ నిర్మూలనకు చేయి చేయి కలుపుదాం.

## కిడ్నీ క్యాన్సర్ అవగాహన కొరకు ప్రత్యేక సదస్సు నిర్వహణ




విశాఖపట్నం ,(కింగ్ )

ప్రపంచ కిడ్నీ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా, 18 జూన్ 2026 నాడు, ఒమెగా హాస్పిటల్, విశాఖపట్నం ప్రజల్లో కిడ్నీ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం మరియు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి దిశగా ఒక ముఖ్యమైన కార్యక్రమాన్ని చేపట్టింది.

ఈ కార్యక్రమాన్ని డా. బి. రవిశంకర్ (మేనేజింగ్ డైరెక్టర్) గారు,ఒమెగా వైద్య సిబ్బంది డా. పైడి వెంకటేశ్వరరావు, డా. కె. వెంకటేష్, డా. కె. ప్రకాష్, డా. శృతి వేగెస్నా, డా. సౌజన్య, డా. ప్రశాంత్, డా. సూర్యరేఖ తో పాటు సీఓఓ శుభాకర రావు అధికారికంగా ప్రారంభించారు.

ప్రజల ఆరోగ్య ప్రయోజనార్థం కేవలం ₹799 కే ప్రత్యేక ఆరోగ్య పరీక్షల ప్యాకేజీని ఈ సందర్భంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ డా. బి. రవిశంకర్ , "కిడ్నీ క్యాన్సర్ ప్రారంభ దశల్లో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. అయితే వ్యాధిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాలను కాపాడవచ్చు" అని తెలిపారు.

అలాగే సీఓఓ శుభాకరరావు మాట్లాడుతూ, "ఈ ప్రత్యేక ప్యాకేజీ శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలసిందిగా తెలియజేశారు.

ప్యాకేజీలో అందించే పరీక్షలు మరియు సేవలు:

పూర్తి రక్త పరీక్ష (CBC- Complete Blood Count)
సాధారణ మూత్ర పరీక్ష (CUE- Common Urine EIamination)
మూత్రపిండాల పనితీరు పరీక్ష (RFT - Renal Function Test)
అల్ట్రాసౌండ్ అబ్డోమెన్ (Ultrasound Abdomen)
సీరం క్రియాటినిన్ పరీక్ష (Serum Creatinine)
వైద్యుల సంప్రదింపు (Doctor Consultation)
డైటీషియన్ సంప్రదింపు (Dietician Consultation)

ఈ కార్యక్రమం కిడ్నీ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం మరియు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న స్క్రీనింగ్ ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ప్రజలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. కాన్సర్ పై అవగాహనను విస్తరించేందుకు, ప్రాణాలను కాపాడేందుకు మనమందరం కలిసి పనిచేద్దాం.

# ప్రజలపై ధరల భారం..శిల్పా సహకార్‌పై రాజకీయ కక్షల కత్తి?

**10% రాయితీతో సరుకులు అందించిన సంస్థ మూత.**

**వేల కుటుంబాల్లో ఆందోళన.**

**ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యమా?**

**అంటూ విమర్శలు.**


**"ప్రజలకు మేలు చేస్తే ఇదే గతి? శిల్పా సహకార్ మూసివేతపై**

**విమర్శల వెల్లువ".**

**ప్రజల కోసం పనిచేస్తే రాజకీయ కక్షలే బహుమతా?"లి**

**"రాయితీ సరుకులకు తాళం**

**రాజకీయ కక్షలకు పూలహారం?"**




నంద్యాల ,(కింగ్ )

పెరుగుతున్న ధరలతో సామాన్య,మధ్యతరగతి కుటుంబాలు అల్లాడుతున్న తరుణంలో తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందిస్తూ ప్రజలకు అండగా నిలిచిన శిల్పా సహకార్ కార్యకలాపాలు నిలిచిపోవడం చర్చనీయాంశంగా మారింది.మార్కెట్ ధరల కంటే 10 శాతం వరకు రాయితీతో సరుకులు అందించిన ఈ సంస్థను రాజకీయ కారణాలతో ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శిల్పా సహకార్ ద్వారా వేలాది కుటుంబాలు ప్రతి నెలా గణనీయమైన మొత్తాన్ని ఆదా చేసుకున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.అయితే సంస్థ మూసివేతతో మళ్లీ అధిక ధరలకు సరుకులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ప్రత్యక్షంగా లాభం చేకూర్చే కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం,రాజకీయ విభేదాల కారణంగా వాటికి అడ్డంకులు సృష్టిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఒక సంస్థ ప్రజలకు ఉపయోగపడుతోందా? లేద? అన్నది పక్కన పెట్టి,దాని వెనుక ఎవరు ఉన్నారన్న అంశానికే ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ప్రజలకు తక్కువ ధరలకు సరుకులు అందించడం తప్పా?", "ప్రజల ఖర్చులు తగ్గించే ప్రయత్నాలను ఎందుకు అడ్డుకుంటున్నారు?", "రాజకీయ కక్షల కోసం సామాన్యులను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు?" అంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

.ప్రజల కోసం పనిచేసే శిల్పా సహకార్ లాంటి సంస్థలను బలహీనపరిస్తే నష్టపోయేది రాజకీయ నాయకులు కాదని,సామాన్య ప్రజలేనని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.శిల్పా సహకార్ మూసివేతతో లాభ పడింది ఎవరు? నష్ట పోయింది ఎవరు? అనే చర్చ ప్రస్తుతం పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రజలకు కొంత ఊరట కల్పించిన వ్యవస్థను కొనసాగించకుండా నిలిపివేయడం వెనుక రాజకీయ కారణాలే ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజల సంక్షేమం కంటే రాజకీయ కక్షలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

ప్రజలకు లాభం చేకూర్చిన కార్యక్రమం ఎందుకు నిలిచిపోయింది? వేలాది కుటుంబాలపై అదనపు భారం ఎందుకు పడింది? ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా? అనే ప్రశ్నలకు బాధ్యులు సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

"ప్రజా ప్రయోజనాలను కాపాడండి..రాజకీయ కక్షలను కాదు".

"సంక్షేమ కార్యక్రమాలను ప్రోత్సహించండి..సేవా సంస్థలను వేధించవద్దు".

"ప్రజల కోసం పనిచేసే శిల్పా సహకార్ లాంటి సంస్థలకు అండగా నిలవండి"అనే నినాదాలు ఇప్పుడు లబ్ధిదారుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో నమోదు కావాలి**

**బీఎల్‌ఓలు ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్‌ఓ యాప్‌లో నమోదు చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




నంద్యాల ,(కింగ్ )

ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం సిరివెళ్ల మండలంలోని గోవిందపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్‌హా జి. రాజకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్వర్ణగ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సచివాలయ పరిధిలో పనిచేస్తున్న బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న పనితీరు, వారి సంఖ్య, రోజువారీగా స్వీకరిస్తున్న దరఖాస్తులు, వాటి పరిష్కార స్థితి, ఇప్పటివరకు నమోదైన చేర్పులు, తొలగింపులు, మార్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు)తో సమావేశమై ప్రత్యేక సవరణ కార్యక్రమంపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రతి అర్హుడైన ఓటరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ధృవీకరణ అనంతరం ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా బీఎల్‌ఓ యాప్‌లో నమోదు చేసి పూర్తి చేయాలని సూచించారు. వివరాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలని, ప్రతి అర్హ ఓటరుకు సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు కావాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరచడం, పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యాప్‌లో నవీకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి రాజకీయ పార్టీలు, బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# ఆత్మకూరు పట్టణంలో ఈనెల 19న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

## 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ స్వీకరణ



నంద్యాల ,(కింగ్ )

జిల్లా పరిపాలన చేపట్టిన "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన ఆత్మకూరు పట్టణంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌హా జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఆత్మకూరు మండల ప్రజలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు.

ఆత్మకూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# అన్ని గిరిజన ఆశ్రమ హాస్టల్లో వెంటనే ఏఎన్ఎం లను నియమించాలి. సిపిఎం. కోరాడ.

సాలూరు. ,(కింగ్ )




పార్వతీపురం మన్యం జిల్లా లో ఉన్న అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలను
నియమించాలి. సిపిఎం. పాచిపెంట మండల కేంద్రంలో సిపిఎం మండల నాయకులు దీసరి వసంతరావు. సుర్రు రామారావు . సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు. పత్రికా విలేకరులతో మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఉన్న అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఏఎన్ఎం లను నియమించాలని. రాష్ట్ర మంత్రివర్యులు. సంధ్యారాణి గారు ఎన్నికల హామీ సందర్భంగా అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లను నియమిస్తామని చెప్పడం చాలా సంతోషకరం ఈ విధంగా చేస్తే రెగ్యులర్ గా విద్యార్థిని విద్యార్థులు ఆరోగ్యాలు బాగుంటాయని పిల్లల తల్లిదండ్రులకు ఎటువంటి ఆవేదన ఇబ్బంది ఉండదని అందువలన మీ కు టమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండేళ్లు గడిచినప్పటికీ గిరిజన హాస్టల్లో ఏఎన్ఎంలను నియమించలేదని. కావున ఎప్పటికైనా మంత్రి స్పందించి వెంటనే ఏఎన్ఎం లను నియమించి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆరోగ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పారిశు ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మౌలిక సదుపాయాలు మంచిగా ఉండేటట్లు జిల్లా అధికారులు పర్యవేక్షణ నిత్యం ఉ ండాలని. ఆ రకంగా విద్యార్థులు విద్యా ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైనటువంటి మంచి నిర్ణయాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని అయన ఈ సందర్భంగా విలేకరులుకు తెలిపారు.

# తాడి గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే బాధ్యత నాది

**జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు**

**గ్రామంలో లబ్ధిదారులు పెరగడం వల్లనే తాడి తరలింపు ఆలస్యం అవుతుంది**

పరవాడ ,(కింగ్ )

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడలో ఎకో నా హోటల్లో తాడి గ్రామ తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలంటూ గురువారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును తాడి కూటమి నాయకులు కలవడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్న తరుణంలో తమ గ్రామ తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని వారు కోరారు. దీనికి పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాను గెలిచిన వెంటనే తాడి గ్రామాన్ని తరలిస్తానంటూ మాట ఇచ్చిన సంగతి తనకు గుర్తుందని, ఇందులో భాగంగానే గెలిచినప్పటి నుండి సందర్భం వచ్చిన ప్రతిసారి అసెంబ్లీలో ఈ తాడి తరలింపు పై ప్రస్తావించడం, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి విశాఖపట్నం వచ్చిన చంద్రబాబు నాయుడు గారితో కలెక్టర్ల సమావేశంలో దీనిపై ఆదేశాలు ఇచ్చేలా చేశానని అన్నారు. ఇన్చార్జి మంత్రిని కలిసి ఈ తాడి తరలింపు విషయం చెప్పడం జరిగిందని, అనకాపల్లి జిల్లా కలెక్టర్ ను కలిసిన ప్రతిసారి దీనిపై గుర్తు చేస్తున్నానని అన్నారు. అయితే ఒక పెద్ద గ్రామపంచాయతీని ఒక చోటు నుండి మరొక చోటికి తరలించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, కావలసిన నిధులు, గ్రామంలో ఉన్న అసలు లబ్ధిదారులను గుర్తించడం వంటి ఎన్నో విషయాలపై జాగ్రత్త వహించాల్సి ఉందన్నారు. 2009 ఎన్నికల్లో తాను పెందుర్తి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో తాడి తరలింపు ప్రక్రియ ప్రారంభించి, తరలింపుకు సన్నాహాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వలన అది పూర్తి కాలేదని, అయితే తరువాత రెండు ప్రభుత్వాలు మారినప్పటికీ ఇప్పటికీ తాడి తరలింపు ప్రక్రియ జరగకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయన్నారు. గ్రామంలో అప్పటికి ఇప్పటికీ లబ్ధిదారుల సంఖ్య బాగా పెరిగిందని, గ్రామ తరలింపుకు కావలసిన నిధుల విషయంలో కూడా మూడు రెట్లు తేడా వచ్చిందని అన్నారు. ఈ మధ్యకాలంలోనే తాడి తరలింపుకు అనువైన స్థల పరిశీలన కూడా చేశామని, త్వరలోనే తాడి గ్రామాన్ని సురక్షితకు ప్రాంతానికి తరలించి చిరకాల తాడి గ్రామ ప్రజల ఆకాంక్షను నెరవేర్చానని ఆయన హామీ ఇచ్చారు.



# దక్షిణ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభ ఘనంగా నిర్వహణ

విశాఖపట్నం,(కింగ్ )







దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" అనే అంశంపై విజయోత్సవ సభను జగదాంబ అంబికా బాగ్ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ విజయోత్సవ సభను ఏర్పాటు చేశామని తెలిపారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. విశాఖపట్నం అభివృద్ధికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్రాజెక్టు, సాఫ్ట్‌వేర్ సంస్థలు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పలు పారిశ్రామిక సంస్థల రాక కీలకంగా మారనున్నదని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా కూటమి ప్రభుత్వానిదే భవిష్యత్తు అని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. జాలారిపేట సముద్ర తీరంలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కొత్త జాలారిపేట జంక్షన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేయడంతో పాటు, జాలారిపేటను ఆర్కే బీచ్ తరహాలో తీర్చిదిద్దుతామని, స్థానిక మత్స్యకారుల కోసం సామాజిక భవనం నిర్మిస్తామని చెప్పారు. పురాతన లైట్ హౌస్ అభివృద్ధితో పాటు ఎస్.ఎల్. కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని వెల్లడించారు. టౌన్ హాల్, పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వద్ద ఎమ్మార్వో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించనున్నట్లు చెప్పారు. జనతా బజార్ పునర్నిర్మాణం రెండు దశల్లో జరుగుతోందని, పూర్ణ మార్కెట్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. సీ హార్స్ జంక్షన్ వద్ద ఐదు ఎకరాల్లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయనున్నామని, కాన్వెంట్ స్మశానవాటికలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నెహ్రూ బజార్‌లో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో నూతన భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు.

వీసీటీపీఎల్ నిర్మాణ సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు 543 మంది మత్స్యకారులకు ఈ నెలాఖరులోగా రెండు సెట్ల భూములు అందజేస్తామని వెల్లడించారు. జగదాంబ జంక్షన్‌లో డచ్ స్మశానవాటికను పార్కుగా సుందరీకరించి ఆ ప్రాంత రూపురేఖలను మార్చనున్నామని అన్నారు.

రైల్వే స్టేషన్‌లో 14 ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణంతో పాటు రూ.1000 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వేలంపేట లక్ష్మీనగర్, వార్డ్ బాయ్ లైన్, ఏడుగుళ్ల ప్రాంతాల్లో ఆరు హౌసింగ్ ప్రాజెక్టులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధితో పాటు 11 గ్రామాలకు ఆర్చ్‌ల నిర్మాణం చేపట్టామని, దాదాపు 10 సామాజిక భవనాలను నిర్మించామని పేర్కొన్నారు. ఎల్లమ్మతోట, అస్సాం గార్డెన్స్, వెంకటేశ్వర మెట్ట ప్రాంతాల్లో దేవాదాయ భూములు, అంగటి దిబ్బ ప్రాంతంలోని వక్ఫ్ భూముల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి పనులపై ఇప్పటికే కలెక్టర్‌తో పలుమార్లు చర్చించానని, ఎన్నికల ముందు – ఎన్నికల తర్వాత అనే తేడా స్పష్టంగా కనిపించేలా అభివృద్ధి చేశామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ మూడు పార్టీలు ఒకే లక్ష్యంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. "నేను తెలిసి ఎప్పుడూ తప్పు చేయను. తెలియక ఏదైనా తప్పు జరిగితే ప్రజలు మన్నించాలి" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ. రెహమాన్, జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పి. శివప్రసాద్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, స్టేట్ డైరెక్టర్ విజయేంద్ర రెడ్డి , బీజేపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స సురేష్ కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అత్తిలి శంకరరావు, కే. రామ్ కుమార్, తెలుగుదేశం పార్టీ 29వ వార్డు అధ్యక్షుడు ఉరుకుటి గణేష్, జగదీష్, పోలిపల్లి జ్యోతి, కోనాడ చిన్న, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ ,తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ లో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు ఏళ్ళ సుపరిపాలన పూర్తి కార్యక్రమం

కాకినాడ ,(కింగ్ )

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో 2 ఏళ్ల నమ్మకం –అభివృద్ధి, సంక్షేమం పేరిట కాకినాడ సూర్యకళా మందిరంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వేడుకలో ముఖ్య అతిథులుగా హాజరైన.. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, రాష్ట్ర పౌరసపరాల సంస్థ చైర్మన్ తోట సూదీర్ డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జి. బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, కౌడా చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ జిల్లా బీజేపీ అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరావు, మాజి మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్. వర్మ, పిల్లి అనంత లక్ష్మి

# ఘనంగా భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు

కైకలూరు,(కింగ్ )



స్థానిక మండల పరిధిలోని కైకలూరు నియోజకవర్గ భారత చైతన్య యోజన పార్టీ కన్వీనర్ తోకల రామకృష్ణ ఆధ్వర్యంలో సిఎన్ఆర్ గార్డెన్స్ నందు బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గ కన్వీనర్ తోకల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఒక్క బీసీవై పార్టీతోనే సాధ్యమని, బీసీవై పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇప్పటికే పలుచోట్ల జాబ్ మేళాలు నిర్వహించారని, కొన్ని వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అలాంటి వ్యక్తికి మనందరం వెన్నంటే ఉండి రాబోయే రోజుల్లో అధికారం దిశగా పోరాడాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో కైకలూరు నియోజకవర్గంలో అత్యధిక జనాభా బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉన్నారని, కైకలూరు నియోజకవర్గం లో జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తర్వాత మహిళలకు ,వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ నాగమణి, యూత్ కన్వీనర్ పాపారావు, రమేష్, ప్రసాద్, పాము అరవింద్ మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దత్తాశ్రమంలో మజ్జిగ వితరణ

**పంపిణీ చేసిన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పోసిన చెంచు రామారావు**


మండవల్లి ,(కింగ్ )




మండలంలోని లోకుమూడి దత్తాశ్రమం నందు నిర్వహిస్తున్న మజ్జిగ వితరణ కార్యక్రమంలో నూతన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పోసిన చెంచు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన వంతుగా గురువారం మజ్జిగ పంపిణీకి దాతగా నిలిచారు. ముందుగా ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ గత నెల రోజులుగా వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దత్తాశ్రమ నందు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు పరసా ఏడుకొండలు, మాడేం కృష్ణారావు, అల్లూరి సత్యనారాయణ, మారగాని బద్రి , కందుల నితిన్ సామ్రాట్, పోలగాని మహాలక్ష్మణుడు,సొంటి చిన్న, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 20 నుంచి 23 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం

విశాఖపట్నం,(కింగ్ )



ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఆధ్వర్యంలో జూన్ 20 నుంచి 23 వరకు నాలుగు రోజులపాటు విశాఖ మురళి నగర్, రాంనగర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మేనేజర్ దినూప్ తెలిపారు. మైగ్రేన్, వెన్నునొప్పి, కీళ్ల వాపులు, నొప్పి, అధిక బరువు ఈ తరహా సమస్యల పరిష్కారానికి ఆయుర్వేద వైద్య చికిత్స ద్వారా పరిష్కారమందిస్తామని తెలిపారు. జూన్ 20, 21 తేదీలలో మురళి నగర్ శ్రీదేవి పార్క్ సమీపంలో ఆయుర్వేద ఔషధాలయంలోనూ, 22 23 తేదీలలో రాంనగర్ జీవీఎంసీ సమీపంలో గల ఔషధ కేంద్రంలోనూ ఈ చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. వివిధ దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఆయుర్వేదం ద్వారా చికిత్స పొందాలనుకునే వారి కోసం నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. 45 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న డాక్టర్ ఉన్ని కృష్ణన్ నాయర్ దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి ఉపశమనం కలిగిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు అపాయింట్మెంట్ పొందేందుకు ఫోన్ నెంబర్ 9030568264 నందు వాట్సాప్ ద్వారా కూడా సమాచారాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు.

# పన్నెండొవ (12) రోజుకు చేరిన యోగాబ్యాస శిక్షణా తరగతులు.

విశాఖపట్నం,(కింగ్ )





బురుజుపేట, విశాఖపట్నం నందు యున్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం అనివెట్టి మండపం నందు నేటి ఉదయశే6.30 నుండి 7.30 వరకు యోగ అధ్యాపకులు నాయుడు యోగ భారతి ట్రస్ట్ వారి పర్యవేక్షణ లొ యోగ సాధన చేయుట జరిగినది. ఈ యొక్క కార్యక్రమం లొ వేదపండితులు, అర్చకస్వాములు, సిబ్బంది, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు. నేడు శ్రీ అమ్మవారి అన్నదాన భవనం నందు గల వెయిటింగ్ హాల్ కు కందుల. నాగరాజు చైర్మన్ ధర్మకర్తల మండలి వారి యొక్క చొరవతో పలువురు దాతలు సహాయం తో ఏసి మెషిన్స్ 6 నెంబర్లు, సీలింగ్, లైటింగ్, వాటర్ కూలర్ ఏర్పాటు చేయడమైనది. ఈ యొక్క ఆధునిక వెయిటింగ్ హాల్ ను నేటి ఉదయం స్థానిక శాసన సభ్యులు, వంశీ కృష్ణ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడ మైనది ఈయొక్క కార్యక్రమం లొ చైర్మన్ కందుల . నాగరాజు ధర్మకర్తలు జి. ఎల్లయ్య, శ్రీమతి,టీ. నాగమణి, ఎమ్. నాగసుధ, టీ. వేణి కుమారి, ఆర్. శైలజ, ఎస్.రామారావు, డి. శ్రీ కాంత్, వార్లు కార్య నిర్వహణధికారి, కె . శోభారాణ. ఈ సి. హెచ్. వి. రమణ, ఎ. ఈ, కే ఎస్. ఎన్. మూర్తి, పర్యవేక్షకులు, పద్మజ, అనురాధ, రమణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి గమ్యస్థానం భీమిలి

## రెండేళ్లలో రూ.2,600 కోట్ల పనులు: గంటా






విశాఖపట్నం,(కింగ్ )

అభివృద్ధికి గమ్యస్థానమైన భీమిలి వైపు ప్రపంచమంతా చూస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రుషికొండ ఏ 1 కన్వెన్షన్ లో గురువారం జరిగిన "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యువత ఐటీ ఉద్యోగాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేస్తామన్నారు. విశాఖలో పని చేయడానికి కాగ్నిజెంట్ సంస్థ ఆసక్తి వ్యక్తీకరణ కోరగా హైదరాబాద్ శాఖలో 1,500 మంది దరఖాస్తు చేసుకుని స్వస్థలానికి వచ్చారని గుర్తు చేశారు. భవిష్యత్ లో ఇతర రాష్ట్రాల ఐటీ నిపుణులు ఉద్యోగాల కోసం విశాఖ వస్తారన్నారు. 2014-19లో 38 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించిన భీమిలిని రూ.4,700 కోట్లతో అభివృద్ధి చేశానని, 2024 లో 93 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చినందుకు కృతజ్ఞతగా అంతకు మించిన అభివృద్ధి చేస్తానన్నారు. రెండేళ్లలో నియోజకవర్గంలో రూ. 2,600 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. విద్యా శాఖ మంత్రిగా గతంలో భీమిలికి ఐ.ఐ.ఎం. తెచ్చేలా సీఎం చంద్రబాబును ఒప్పించానని, ఈసారి ప్రపంచం మొత్తం చూసేలా గూగుల్ డేటా సెంటర్ ను ఆయన విశాఖకు తీసుకువచ్చారని తెలిపారు. ఇటీవల తాను యూరోప్ వెళ్లినప్పుడు విశాఖపట్నం పేరు చెబితే గూగుల్ డేటా సెంటర్ ప్రాంతమని అక్కడి వారు గుర్తించారన్నారు. ఇలాంటి పెట్టుబడులతో చరిత్రలో నిలిచిపోతామని పేర్కొన్నారు. వచ్చే 2 ఏళ్లలో అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువ చేస్తామని చెప్పారు. పనిచేసే ప్రభుత్వానికి రెండు, మూడు దఫాలు అవకాశమిస్తే ఆంధ్ర భవిష్యత్ అద్భుతంగా ఉ ంటుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న పద్మనాభం ఘాట్ రోడ్డు, పాండ్రంగి బ్రిడ్జి, చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు గడిచిన రెండేళ్లలో అమల్లోకి తీసుకురాగలిగామని తెలిపారు. పెన్షన్ పెంపు, అమ్మఒడి చెల్లింపులలో ప్రజలను వంచించిన జగన్మోహన్ రెడ్డి, సూపర్ సిక్స్ మోసమని తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె. సంగీత్ మాథుర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల కృష్ణ, చక్రవర్తి, శాఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు రూ. 4.02 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ (జవీ=ఖ) చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం..,(కింగ్ )

.విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ గణబాబు ఈరోజు తమ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 8 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 4,02,818 /- విలువైన ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో పంపిణీ చేయబడింది

# కుంచాలమ్మ దుర్గమ్మ జాతరకు వాసుపల్లి 50,000 విరాళం

విశాఖపట్నం,(కింగ్ )



పాత పోలీస్ స్టేషన్ 104 ఏరియా పరిధిలో ఉన్న శ్రీశ్రీ కుంచాలమ్మ దుర్గాలమ్మ అమ్మవార్ల మహోత్సవ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్కుమార్ ₹50,000/- రూపాయలు విరాళం అందజేశారు. ఆసీలమెట్ట కార్యాలయంలో బుధవారం కమిటీ సభ్యులకు సొంత నిధులు 50,000/- రూపాయల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఇక్కడి స్థానిక కుంచాలమ్మ దుర్గాలమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ ఉ త్సవానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అదే మాదిరిగా ఈ ఏడాది కూడా విరాళం అందించానని చెప్పారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది వాసుపల్లి గణేష్ కుమార్ తమ పండుగ మహోత్సవానికి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది కూడా తన అమ్మవార్ల పై ఉన్న ప్రగాఢ విశ్వాసంతో ₹50,000/- విరాళం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పేద పాలిట ఆపద్బాంధవుడు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు, ఉ న్నత పదవులు అధిరోహించి ప్రజల సేవ చేసేందుకు అమ్మవార్ల చల్లని ఆశీస్సులతో మళ్లీ రాజకీయ కురుక్షేత్రంలో విజయం సిద్ధించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ బడిలో జిల్లా కలెక్టర్ అబ్బాయి.



## క్లాస్ రూమ్ లో క్రిష్ ధరణ్‌రెడ్డి (నలుపు రంగు చొక్కా)

పార్వతీపురం పట్టణం,(కింగ్ )

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్. మరియు జిల్లా మెజిస్ట్రేట్. డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి తన కుమారుడు ఎన్. క్రిష్ ధరణ్‌రెడ్డిని ప్రభుత్వ బడిలో చేర్పించి, ఆదర్శంగా నిలిచారు. ఈ విద్యార్థి విజయవాడలోని పడమట జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తిచేశాడు. ఇప్పుడు పార్వతీపురంలోని డాక్టర్ దిండిగల్ వెంకట్‌రావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో పదో తరగతిలో చేరాడు. ఓ జిల్లా మేజిస్ట్రేట్ కుమారుడు తమ బడిలో చేరడంతో తమ బాధ్యత మరింత పెరిగిందని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ ప్రజా జ్వాల విలేకరుకు తెలియజేశారు. గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేసిన కూర్మనాథ్ కూడా తన కుమారుడిని ఇదే పాఠశాలలో చదివించారు. అని అయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంపొందించేలా ఉన్న ఈ మంచి నిర్ణయం వల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలుకు ఆదర్శంగా నిలుస్తోంది. అని ప్రధానోపాధ్యాయులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# అన్ని గిరిజన ఆశ్రమ హాస్టల్లో వెంటనే ఏఎన్ఎం లను నియమించాలి. సిపిఎం. కోరాడ.

సాలూరు. ,(కింగ్ )




పార్వతీపురం మన్యం జిల్లా లో ఉన్న అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలను నియమించాలి. సిపిఎం. పాచిపెంట మండల కేంద్రంలో సిపిఎం మండల నాయకులు దీసరి వసంతరావు. సుర్రు రామారావు . సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు. పత్రికా విలేకరులతో మాట్లాడుతూ మన్యం జిల్లాలో ఉన్న అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఏఎన్ఎం లను నియమించాలని. రాష్ట్ర మంత్రివర్యులు. సంధ్యారాణి గారు ఎన్నికల హామీ సందర్భంగా అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎం లను నియమిస్తామని చెప్పడం చాలా సంతోషకరం ఈ విధంగా చేస్తే రెగ్యులర్ గా విద్యార్థిని విద్యార్థులు ఆరోగ్యాలు బాగుంటాయని. పిల్లల తల్లిదండ్రులకు ఎటువంటి ఆవేదన ఇబ్బంది ఉండదని అందువలన మీ కు టమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండేళ్లు గడిచినప్పటికీ గిరిజన హాస్టల్లో ఏఎన్ఎంలను నియమించలేదని. కావున ఎప్పటికైనా మంత్రి స్పందించి వెంటనే ఏఎన్ఎంలను నియమించి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆరోగ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని. మౌలిక సదుపాయాలు మంచిగా ఉండేటట్లు జిల్లా అధికారులు పర్యవేక్షణ నిత్యం ఉండాలని. ఈ రకంగా విద్యార్థులు విద్యా ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైనటువంటి మంచి నిర్ణయాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన కార్యక్రమం చేపడతామని అయన ఈ సందర్భంగా విలేకరులుకు తెలిపారు.

# రెండేళ్ల పాలనలో రాష్ట్రానికి పూర్వ వైభవం..

**ప్రజలే సాక్షిగా ప్రభుత్వ పనితీరుపై సమీక్ష..**

**వివిధ వర్గాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..**

కొత్తపేట,(కింగ్ )

కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వివిధ వర్గాల ప్రజలను కలిసి వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, పాలన పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులు, చేనేత కార్మికులు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లు, రైతులు, డీఎస్సీ అభ్యర్థులు, ఎస్సీ సోదరులు, పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ పథకం లబ్ధిదారులు, ఆటో డ్రైవర్ సంక్షేమ పథకం లబ్ధిదారులు, తెలుగుదేశం పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా లబ్ధిదారులతో ఎమ్మెల్యే ప్రత్యేక వేరు వేరు సమావేశాలు నిర్వహించారు.



గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో తీసుకువచ్చిన మార్పులను లబ్ధిదారులు ఎమ్మెల్యేకు వివరించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చులకు అండ లభించిందని, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులకు భరోసాగా నిలిచాయని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, కార్మికులు, దివ్యాంగులు సహా అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవకాశం లభిస్తుందని బండారు పేర్కొన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి, ఎన్టీఆర్ భరోసా

# ఆరోగ్యకర జీవనానికి మార్గదర్శి "యోగా"- ప్రిన్సిపాల్ డి సునీత

ఏలేశ్వరం,(కింగ్ )

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలేశ్వరం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేస్తూ పురవీధుల గుండా ప్రచారం చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సునీత మాట్లాడుతూ, యోగా భారతదేశానికి చెందిన ప్రాచీన జీవన విధానమని, శరీరం-మనస్సు-ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే శాస్త్రీయ ప్రక్రియ అని అన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో యోగా ఆరోగ్యకరమైన జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు.యోగా సాధన వల్ల శారీరక దృఢత్వం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడతాయని, రక్త ప్రసరణ సక్రమంగా జరిగి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని, రోగనిరోధక శక్తి పెరిగి మంచి నిద్రకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించి ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ మాట్లాడుతూ, యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. వేంకటేశ్వరరావు, అధ్యాపకులు కె. సురేశ్, డా. మదీనా, డా. శివప్రసాద్, శ్రీలక్ష్మి, వీరభద్రరావు, డా. బంగార్రాజు, సతీశ్, మేరీ రోజలీనా, పుష్ప, రాజేష్, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.




# ఒలంపిక్ డే సందర్భంగా రిడ్జ్ స్కూల్లో ఆర్చరీ పోటీలు

కర్నూల్ స్పోర్ట్స్,,(కింగ్ )

ఏకాగ్రత విలువిద్య సాధన చేయాలి,స్థానిక లక్ష్మీపురంలోని రిడ్జ్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి విలువిద్య నిర్వహించినారు. ఈ సందర్భంగా జి. గోపినాథ్ సీఈఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విలువిద్య యొక్క గొప్పతనం, ఏకాగ్రత, క్రమశిక్షణ, సహనం మరియు శారీరక దృఢత్వం గురించి వివరించారు. క్రీడల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభనుమెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.కర్నూలు జిల్లా ఆర్చరీ కార్యదర్శి కె నాగరత్నమయ్య విద్యార్థులతో మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలలో ఆర్చరీ క్రీడలో ఉన్న అవకాశాలను వివరించారు. విద్యార్థులు ఈ క్రీడలో చురుకుగా పాల్గొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు.జి. సౌమ్య గోపినాథ్ మాట్లాడుతూ ఆర్చరీ క్రీడ ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు అందుబాటులో ఉన్న శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీన్ పి.కె. రాజేంద్రన్, ప్రిన్సిపాల్ ఎ. రాజ్‌కమల్, శ్రీనివాసులు, నాగేంద్ర, చరణ్, రహ్మతుల్లా, గంగన్న, ఇమామ్ హుస్సేన్, మద్దిలేటి, భరత్ మరియు, నరేంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు విలువిద్యపై అవగాహన కల్పించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.





# విలేకరి రాజు గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే విజయ్ చంద్ర.





పార్వతీపురం,(కింగ్ )

పార్వతీపురం పట్టణంలోని విలేకరి గుంట రాజు నూతన గృహప్రవేశం ఈ రోజు జరిగిన సందర్భంగా , ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర సందర్శించారు. గురువారం రాత్రి వారి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే విజయ చంద్ర ఆ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో ఆ కుటుంబ సభ్యులకు అంతా మంచి జరగాలని, సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు చేకూరాలని ఎమ్మెల్యే విజయచంద్ర ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు. బంధుమిత్రులు. విలేకరులు. తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ. జులై 13.లోపు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలి డీఈవో.

పార్వతీపురం,(కింగ్ )

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026కు ఆన్లైన్లో అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో కనీసం పదేళ్ల రెగ్యులర్ సర్వీసు పూర్తిచేసిన ఉపాధ్యాయులు.ప్రధానోపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను జులై 13 లోపు ఆన్ లైన్ వెబ్ పోర్టల్ ద్వారా సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ ఈ సందర్భంగా విలేకరులకు తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.**

**కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఏపీ సీసీ ప్రతినిధుల దిశా నిర్దేశం**

పార్వతీపురం: ,(కింగ్ )



త్వరలో జరగనున్న సంస్థాగత ఎన్నికలు లక్ష్యం కావాలని కాంగ్రెస్ పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ జి. మహేష్, స్టేట్ ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జి వి వి ఎస్ కమలాకరరావు అన్నారు. గురువారం పార్వతీపురం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులపై ఆరా తీశారు. బిఎల్ఎ ల నియామకం, ఎస్ ఐ ఆర్ పై అవగాహన, జిల్లా, నియోజకవర్గ, మండల, పంచాయితీ కమిటీల ఏర్పాటు తదితర వాటి గూర్చి అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పని చేయాల్సిందేనని అన్నారు. గ్రూపుల, గొడవలు పార్టీ క్షమించదన్నారు. అందరూ కలిసి పని చేయాల్సిందేనని హెచ్చరించారు. ఎవరి పరిధిలో వారు పార్టీ బలోపేతానికి పార్టీ ఆదేశాల మేరకు పని చేయాలన్నారు. క్రమశిక్షణ కొరవడితే అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతినెల డిసిసి సమావేశాలు నిర్వహించాలన్నారు. పార్టీ కార్యక్రమాలు అందరూ కలిసి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చి జరిపి పార్టీని దిశా నిర్దేశం చేస్తారు. ఈ కార్యక్రమంలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు కోఆర్డినేటర్లతోపాటు ఆ పార్టీ ఎస్సీ, బీసీ సెల్, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గం నాయకులు. మండల పార్టీ అధ్యక్షులు. సాలూరు నియోజకవర్గం. ఇంచార్జ్ గేదెల రామకృష్ణ. సాలూరు పట్టణ అధ్యక్షులు సిగడపు.బంగారయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం నియోజకవర్గంలో రేపు జూన్ 19న నిర్వహించాల్సిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు

**దివ్యాంగుల ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం జూన్ 27న నిర్వహణ**

**.... జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం: ,(కింగ్ )



"ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల జూన్ 19వ తేదీన భీమవరం నియోజకవర్గంలో నిర్వహించాల్సి ఉండగా, అనివార్య పరిపాలనా కార్యక్రమాల కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

జూన్ 19వ తేదీన ఉదయం భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న థీమాటిక్ యోగా కార్యక్రమంలో, అనంతరం డి.ఎన్.ఆర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల అభివృద్ధి విజయాలను ప్రజలకు వివరించే సమగ్ర కమ్యూనికేషన్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో, అలాగే పెద్దఅమీరం గ్రామంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన విజయాలపై నిర్వహించనున్న కార్యక్రమాలలో జిల్లా యంత్రాంగం పాల్గొనాల్సి ఉన్నందున ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని ఆమె వెల్లడించారు.

అదేవిధంగా, ప్రతి నెల మూడవ శుక్రవారం నిర్వహించే దివ్యాంగుల ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కూడా ఇదే కారణాల దృష్ట్యా జూన్ 19న నిర్వహించడం సాధ్యంకాకపోవడంతో రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల సమస్యలు, వినతులను స్వీకరించి పరిష్కరించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఈ నెల జూన్ 27వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రజలు, దివ్యాంగులు ఈ మార్పును గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినియోగంలో లేని వస్తువుల వేలం .

## వేలంలో పాల్గొన్న 29 మంది ఔత్సాహికులు.

## మొత్తం వస్తువులు 4,50,000 రూపాయలకు వేలం.

నంద్యాల ,(కింగ్ )

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు ఏర్పాటు చేయచేయబడిన కమిటి జిల్లా సాయుధ బలగాల అదనపు ఎస్పి దీ.చిన్నికృష్ణ ఆధ్వర్యంలో నేడు నంద్యాల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో (పోలీస్ క్వార్టర్స్ దగ్గర) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు వినియోగించదగని కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానేర్లు, ట్యాబులు, జెనరేటర్లు,ఖూా బాట్టరిలు మరియు ఇతర వస్తువులు బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది. ఈ వేలం పాట నందు 29 మంది ఔత్సాహికులు వేలంలో పాల్గొనడం





జరిగింది. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా (పోటా పోటీగా) జరిగిన వేలంలో వినియోగంలో లేని మొత్తం వస్తువులను 4,50,000/-రూపాయలకు అబ్దుల్ వాహబ్ అనే వ్యక్తి దక్కించుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధబలగాల అడిషనల్ ఎస్పీ గారితో పాటు ~ూ= డీఎస్పీ శ్రీనివాసరావు గారు,ఇన్స్పెక్టర్లు సూర్యమౌళి, సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు ,విజయ్ లు, జిల్లా పరిపాలన విభాగం అధికారులు వీరన్న, ఖాదర్ భాష పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.

## హోంగార్డులకు ప్రమాదబీమా సౌకర్యంపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో అవగాహన.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందండి.

నంద్యాల ,(కింగ్ )

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నేటి ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని మైదానంలో హోంగార్డ్స్ పెరేడ్ మరియు దర్బార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 60 మంది హోంగార్డులు హాజరయ్యారు.



ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ శ్రీ వీ.మహేష్ కుమార్ హోంగార్డ్ కవాతును పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ హోంగార్డ్ సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి సంవత్సరం హోంగార్డులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని దాని వలన కలిగే ఉపయోగాలను గురించి తెలియజేశారు. మరియు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు , వాటి ప్రయోజనాలు , ఆరోగ్య భద్రత కోసం బీమా ప్రాముఖ్యతపై యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో హోంగార్డులకు అవగాహన కల్పించారు.

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు నంద్యాల జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని వచ్చే విధంగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.

అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరచిన హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కమాండెంట్ గారితో పాటు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పి బి. చిన్ని కృష్ణ గారు,~ూ= డీఎస్పీ శ్రీనివాసులు గారు,హోంగార్డ్ డి.ఎస్.పి ప్రసాద్ గారు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు బాబు గారు, విజయ్ గారు లు,=ూ× లు హర్షవర్ధన్ రెడ్డి గారు పాల్గొన్నారు.

# తెనాలిలో వైఎస్సార్ విగ్రహ తయారీని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి.

నంద్యాల ,(కింగ్ )

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పర్యటించారు. తెనాలిలోని ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, వారి తనయుడు కాటూరి రవిచంద్ర ల ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తయారీని ఆయన స్వయంగా పరిశీలించారు. విగ్రహ శిల్పకళా నైపుణ్యాన్ని చూసి ఆయన శిల్పులను అభినందించారు. నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్ నందు ఇటీవల మహానేత దివంగత డా.వైఎస్సార్ విగ్రహం ధ్వసం జరిగిన ఘటన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తన సొంత నిధులతో డా.వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రజల సాక్షిగా ప్రకటించడం జరిగింది. ఈ మేరకు ఆయన తెనాలీలో డా.వైఎస్సార్ విగ్రహ తయారీని పరిశీలించారు. శిల్పకళకు పుట్టినిల్లుగా పేరుగాంచిన తెనాలి పట్టణంలో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నంద్యాల నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న అత్యంత భారీ, ప్రతిష్టాత్మక వైఎస్సార్ విగ్రహాన్ని తెనాలికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, వారి కుమారుడు కాటూరి రవిచంద్ర తయారు చేస్తున్నారు. ఈ విగ్రహ తయారీ పనులను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు శిల్పశాలను సందర్శించి స్వయంగా పరీక్షించారు. విగ్రహం యొక్క రూపకల్పన, వైఎస్సార్ గారి ముఖంలో ఉండే ఆ చిరునవ్వు, ఆయన రాజసం ఉట్టిపడేలా



శిల్పాన్ని మలుస్తున్న తీరును చూసి రవిచంద్ర కిషోర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ రూపానికి నిలువెత్తు రూపంగా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు.

# విధుల నిర్వహణ పాలనాపరమైన అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

రుద్రవరం.,(కింగ్ )

మండల కేంద్రమైన రుద్రవరంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో విధుల నిర్వహణ మెరుగు పరుచుకునే విధానం, పాలనాపరమైన అంశాలపై పంచాయతీరాజ్ డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన లో భాగంగా గ్రామ పంచాయతీలలో విధుల నిర్వహణ, విధులు మెరుగుపరుచుకునే విధానం, పరిపాలన, నాయకత్వ నైపుణ్యాలు, అభివృద్ధి ప్రణాళికలు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీలలో నిధులు సమకూర్చుకునే విధానం, అభివృద్ధి మౌలిక వసతులు సౌకర్యాలు అందించే దిశగా పాలన సాగించాలని కార్యదర్శులకు సూచించామన్నారు. గ్రామ పంచాయతీలలో స్థానిక స్థాయిలో పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య మరియు పారిశుధ్యం వంటి లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# రైతులకు బయో మందులు అంటగట్ట వద్దు

## - ఎరువుల లైసెన్స్ సస్పెండ్.

## : తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఎమ్మిగనూరు,(కింగ్ )

రైతులకు బయోమందులు అంటగట్ట వద్దని, బలవంతం బలవంతం చేస్తే ఎరువుల దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ మహమ్మద్ ఖాద్రి,మండల వ్యవసాయ అధికారి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం రైతుల ఫిర్యాదు పై పట్టణంలో ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు.

ఈ నెల 13 వ తేదీన ట్యాంక్ బండ్ రోడ్డులో ఉన్న శ్రీ రాఘవేంద్ర ఏజెన్సీస్ ను తనిఖీ చేయడమైనది. తనిఖీల్లో భాగంగా కే ఉరుకుంద, తిమ్మాపురం రైతుకు ఒక యురియా బస్తాకు ఒక బయో స్టిములెంట్ అలా మొత్తము రెండు యూరియా బస్తాలకు రెండు బయోమందులు లింకుతో అమ్మకాలు చెయ్యడం, వాటికి కూడా బిల్లు ఇవ్వకుండా రైతుకి ఇవ్వడం జరిగింది. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 చట్టంలోని క్లాస్ 7 మరియు 9 చట్టాన్ని వ్యతిరేకంగా రైతులకు ఇవ్వడం అయినది. అందుకు సంబంధించి సదరు డీలర్ కు షోకాస్ నోటీస్ ఇవ్వడం జరిగింది.షోకాస్ నోటీసుకు ఇచ్చిన వివరణ ఆధారంగా శ్రీ రాఘవేంద్ర ఏజెన్సీస్ కి చెందిన ఎరువుల లైసెన్స్ ను 30 రోజులపాటు సస్పెన్షన్ చేయడమైనది.ఈ సస్పెన్షన్ భాగంగా లో డీలరు ఎటువంటి ఎరువులు అయినా రైతులకు విక్రయించకూడదు.

15-6-2026 వ తేదీన త్రివేణి ఆగ్రో ఎంటర్ప్రైజెస్, అంబేద్కర్ సర్కిల్ ఎమ్మిగనూరు నందు ఉన్న షాపును కూడా తనిఖీ చేయడమైనది




తనిఖీలో భాగంగా 5 యూరియా బస్తాలు మరియు నాలుగు డిఏపి బస్తాలు మొత్తం తొమ్మిది బస్తాలకు 9 నానో డీఏపీ ఎరువులను లింకుతో రామ గోవిందు, టీఎస్ కుల్లూరు అనే గ్రామ రైతుకు విక్రయించడమైనది, కావున ఈ డీలర్ కూడా షోకాజ్ నోటీసు ఇవ్వడం అయినది.ఇతను షోకాజ్ నోటీసుకు వివరణ ఇచ్చిన తర్వాత, దానికి అనుగుణంగా , ఈ డీలర్ మీద కూడా ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 మరియు ఈసీ యాక్ట్ 1955 చట్టము ప్రకారం లైసెన్స్ క్యాన్సల్ లేక లైసెన్స్ ను 30 రోజుల పాటు సస్పెన్షన్ ను (ఎటువంటి ఎరువుల విక్రయాలు అమ్మకూడదు) తీసుకుంటామని తెలపడమైనది.. కావున డీలర్లు అందరూ ఏమైన ఎరువులు లింకుతో ముడిపెట్టి రైతులకు అమ్మకూడదు ఇలా అమ్ముతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కల్పించాలి - ఏపీడబ్ల్యూజేఎఫ్

: ఎమ్మిగనూరు,(కింగ్ )

రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) గౌరవ అధ్యక్షులు వి దేవేంద్ర మూర్తి, గిప్సన్, తాలూకా అధ్యక్షులు షబ్బీర్, కార్యదర్శి నాగరాజ్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు మండల విద్యాధికారి ఆంజనేయులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు సమాచారాన్ని చేరవేసే బాధ్యతాయుతమైన వృత్తిలో పనిచేస్తున్నప్పటికీ, వారి పిల్లల విద్యాభారం రోజురోజుకూ పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు కనీసం 50 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా కమిటీ నాయకులు నరసింహులు, సోహెల్, సునీల్, రెహమాన్, సురేంద్ర, మురళి, మోషా, రాజు, విజయ్, లతీఫ్, ఖాదర్, బేగ్ రుక్మాన్, ఈరన్న, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జూన్ 21న నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామినేషన్ కు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

### జిల్లాలోని 16 నిర్దేశిత కేంద్రాలలో పరీక్షకు హాజరు కానున్న 4,995 విద్యార్థులు

కర్నూల్ కలెక్టరేట్,(కింగ్ )



ఈ నెల 21 వ తేదీన జరగనున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నీట్ (యుూజీ) 2026 రీ-ఎగ్జామినేషన్ ను ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి పేర్కొన్నారు.ఈ నెల 21వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 2 గం నుండి 5 గం వరకు జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు సాయంత్రం 6.15 గంటల వరకు అదనపు సమయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో పేర్కొన్న రిపోర్టింగ్ సమయానికి చాలాముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకుని భద్రతా తనిఖీలు, ధృవీకరణ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు.

జిల్లాలోని 16 నిర్దేశిత కేంద్రాలలో ఈ పరీక్ష నిర్వహించబడుతుందని, సుమారు 4,995 విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు.

రీ-ఎగ్జామినేషన్ ను పారదర్శకంగా నిర్వహించడానికి తహశీల్దార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లకు మానిటరింగ్ ఆఫీసర్ లుగా పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.ప్రతి సెంటర్ కు ఒక తహసీల్దార్, ప్రతి నాలుగు సెంటర్లకు జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించామని తెలిపారు. పోలీస్ అధికారులు మరియు ఇతర శాఖాధికారులతో సమన్వయం చేసుకుంటూ, పరీక్ష సజావుగా, నియమ నిబంధనలకనుగుణంగా నిర్వహించడానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలియజేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీసు సిబ్బందిని నియమించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహ నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# జూన్ 24న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

### జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ సందర్శన

### బహిరంగసభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి- కర్నూల్ కలెక్టరేట్ ,(కింగ్ )




రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న కర్నూలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి తొలుత హెలిప్యాడ్కు చేరుకుని జొన్నగిరిలోని జియో మైసూర్ గోల్డ్ మైన్స్ను సందర్శిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా భూమిపూజ, బంగారం పంపిణీ కార్యక్రమం, ప్లాంట్ పరిశీలన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. హెలిప్యాడ్, రహదారులు, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లను రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్, పారిశుధ్యం, లైటింగ్, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్లు, మొబైల్ టాయిలెట్లు, మెడికల్ క్యాంప్లు, తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ రంగానికి సంబంధించి పీఎండీఎస్, డ్రిప్ ఇరిగేషన్, జలధార-జలహారతి, స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర, డి ఆర్ డి ఏ, స్కిల్ డెవలప్మెంట్ తదితర కార్యక్రమాల ద్వారా సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రొటోకాల్ నిబంధనలకు అనుగుణంగా వీవీఐపీ, వీఐపీ అతిథుల కోసం ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. సమావేశానికి వచ్చిన ప్రజలకు భోజనం ఏర్పాట్లలో లోపం లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

: ప్రతిభ చాటిన విద్యార్థులు

ఎమ్మిగనూరు,(కింగ్ )







ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటడం పట్ల నారాయణ కళాశాలల కొరోడెన్ లింగేశ్వర్ రెడ్డి, ఎమ్మిగనూరు కళాశాల డీన్ వెంకటేశ్వర్లు , ఏటీఎం రమణారెడ్డి సంతృప్తి వ్యక్తిని తీశారు. గురువారం వెలువడిన ఫలితాల్లో ఎమ్మిగనూరు నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ బెటర్మెంట్ ఫలితాలలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు విశిష్ట గుర్తింపు తీసుకొచ్చారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె. రేఖా శ్రీ, కె. ఎం. సిరి చందన 470కి 467 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి కళాశాల ఖ్యాతిని రాష్ట్రవ్యాప్తంగా చాటారు. అనంతరం ఎం. కృష్ణ చైతన్య 470కి 466 మార్కులు, ఎస్. నందీశ్వర్ 470కి 465 మార్కులు, జి. ఎం. డి. షాహిద్ 470కి 464 మార్కులు, సి. కీర్తన 470కి 463 మార్కులు, ఎ. లిఖిత 470కి 463 మార్కులు, జి. మహేష్ కుమార్ 470కి 462 మార్కులు, యు. ఎం. కీర్తన 470కి 461 మార్కులు, డి. సఫ్వానా అఫ్షీన్ 470కి 461 మార్కులు, ఎ. ఎం. డి. ఇర్షాద్ 470కి 461 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు.

మొత్తం 15 మంది విద్యార్థులు 460 కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 73 మంది విద్యార్థులు 400 కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషం.

అలాగే బైపీసీ విభాగంలో ఎన్. అనీషా ఫలక్ 455కి 450 మార్కులు, జి. రీనా 455కి 444 మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను నిలబెట్టారు.

ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె. దివ్యప్రియ రెడ్డి 1000కి 990 మార్కులు, జి. రాజ్యలక్ష్మి 1000కి 987 మార్కులు, కె. సౌమ్య 1000కి 984 మార్కులు సాధించారు. అలాగే బైపీసీ విభాగంలో కె. అభినయ 1000కి 988 మార్కులు, ఎస్. సఫియా మహిన్ 1000కి 977 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ ఫలితాలతో తమ కళాశాలకు మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే బీవీ

## జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

ఎమ్మిగనూరు ,(కింగ్ )





ఎన్నికలు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వము కూటమి ప్రభు అని ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరులో కూటమి ప్రభుత్వ రెండేళ్ల సందర్భంగా నిర్వహించిన భారీ మోటార్ బైక్ ర్యాలీ, విజయోత్సవ సభ ఎమ్మెల్యే బీ.వీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, మార్కెట్ యార్డ్ సర్కిల్, ఓం శాంతి సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్ మీదుగా కుర్నీ కళ్యాణ మండపం వరకు భారీ ఎత్తున ర్యాలీ సాగింది.అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ , ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి , పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్ , బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు , జనసేన నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి రేఖా గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మూడు పార్టీల జెండాలను ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మా తెలుగు తల్లి" ప్రార్థనా గీతంతో సభను ప్రారంభించారు.ఈ సందర్భంగా గురజాలకు చెందిన ఎస్సీ నాయకులు పెద్ద కిషన్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు.

జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి గారి ఆశయాలను కొనసాగిస్తూ ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని కొనియాడారు. బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేయబడిందని, జన్ ధన్ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారని అన్నారు.

జనసేన నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి రేఖా గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ ప్రగతిలో కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. విజయోత్సవ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అగైన్... అగైన్... ఎన్డీఏ, నో అగైన్... వైసీపీ అంటూ ప్రజల తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో కొత్త చరిత్ర సృష్టించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు తల్లికి వందనం, స్త్రీ శక్తి, దివ్యాంగ శక్తి, దీపం-2, అన్నా క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, ఆటో డ్రైవర్ల సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు.చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్ఎలు, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ మై టిడిపి యాప్ ద్వారా ప్రతి ఓటరును ధృవీకరించి ఎన్యూమరేషన్ ఫారాలను అప్లోడ్ చేయాలని సూచించారు. అనంతరం కార్యకర్తలతో భోజన విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యోగ ద్వారా మానసిక ఒత్తిడి దూరం అవుతుంది-ఆరోగ్యంగా ఉండగలుగుతాం

### కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజల సహకారం అవసరం- కర్నూలు కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి- మానసిక , శారీరక ఆరోగ్యం యోగా ద్వారా సిద్ధిస్తుంది- పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత





కర్నూల్ ,(కింగ్ )

ఒత్తిడిని తగ్గించుకొని మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి యోగా చాలా ఉపయోగకారిగా పనిచేస్తుందని కావున అందరూ ప్రతి రోజు యోగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల ధిమాటిక్ యోగ కార్యక్రమంలో కార్మికులను ఉద్దేశించి పేర్కొన్నారు.గురువారం కర్నూలు ఎస్ ఏ పి క్యాంపు ఆవరణలో ధిమాటిక్ యోగాలో భాగంగా పారిశుద్ధ కార్మికుల యోగా కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పారిశుద్ధ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఒత్తిడిని తగ్గించుకొని మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి , ఆరోగ్యంగా ఉండడానికి యోగా చాలా ఉపయోగకారిగా పనిచేస్తుందని కావున అందరూ ప్రతి రోజు యోగా చేయాలని అన్నారు. అందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రతి ఒక్కరు చేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాలు చేయిస్తున్నారని తెలిపారు.యోగ వలన రక్తపోటు , మధుమేహ వ్యాధి రావని ఉంటే కంట్రోల్ లోనే ఉంటాయని తెలిపారు. చిన్నపిల్లలు చేసిన అడ్వాన్స్ యోగ చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఈ పిల్లలను ఈ విధంగా చేయడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మరియు వారికి యోగ నేర్పించిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధంగా యోగా చేస్తూ ఉంటే ఈ పిల్లలు భవిష్యత్తులో ఎటువంటి అనారోగ్యాలకు గురి కారని కలెక్టర్ తెలియజేశారు. ఇప్పుడున్న పరిస్థితుల వలన ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతూ ఉన్నారని , దీనివలన అనేక రుగ్మతలకు గురికావలసి వస్తున్నదని అందులో భాగంగా ఫర్టిలిటీ రేటు తగ్గిపోయిందని దీనిని సరి చేసుకోవటానికి ఫర్టిలిటీ సెంటర్స్ పెరిగాయని మన ముందు తరాల వారికి ఫర్టిలిటీ సెంటర్ల విషయం అసలు తెలియవు అని వారికి అవసరం రాలేదు అన్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151."